


పుష్పయాగోత్సవం

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి వారికి బుధవారం వైభవంగా శ్రీ పుష్పయాగోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముగింపుగా స్వామి వారికి ఈ ప్రక్రియ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



	ఇఫ్తార్ (గురు)	సహరి (శుక్ర)
నరసరావుపేట	6.27	4.51
గుంటూరు	6.25	4.49
బాపట్ల	6.25	4.49

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సాగర్ నీటిని పొదుపుగా వాడుకోవాలి

నరసరావుపేట: నాగార్జున సాగర్ జలాశయంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ అధికారుల్ని ఆదేశించారు. ఆయన బుధవారం జిల్లాలో తాగునీటిపై సంబంధిత అధికారులతో క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు నీటి సరఫరాపై గ్రామాల్లో పర్యవేక్షించాలని, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి సమన్వయ సమావేశం నిర్వహించి పకడ్బందీగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. మున్సిపాలిటీల వారీగా నీటి సమస్యలు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల్ని రూపొందించాలని అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా అధికారి ఆర్.ఎస్.ఆర్.సురేష్, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి. భాస్కర్‌రెడ్డి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ టి.వరలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాకాని మల్లేశ్వరుడికి రూ. 52లక్షల ఆదాయం



పెదకాకాని: శివాలయంలో హుండీల కానుకలు లెక్కింపు ద్వారా మల్లేశ్వరుని ఆదాయం గణనీయంగా పెరిగినట్లు డెప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. పెదకాకాని శివాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు అన్ని హుండీలను తెరచి కానుకలు లెక్కింపు చేపట్టారు. పాత గుంటూరు శ్రీఅగస్త్యేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.ఎల్.టి. సౌమ్య పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. లెక్కింపు సాయంత్రం ఐదు గంటల వరకూ కొనసాగింది. 96 రోజులకు గానూ స్వామికి రూ. 52,70,371, అన్నదానం హుండీ ద్వారా రూ.79,370, బంగారం 11.500 గ్రాములు, వెండి 705.500 గ్రాములు లభించినట్లు డెప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.లెక్కింపులో ఆలయ, బ్యాంక్ సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

14న ఫర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్, సీడ్ డీలర్స్ సమావేశం

కొరిటెపాడు(గుంటూరు): ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 14న గుంటూరులోని ఫర్టిలైజర్స్ అండ్ ఇన్‌సెక్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరగనుందని రాష్ట్ర అధ్యక్షుడు వజ్రాల వెంకట నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–27 కాల వ్యవధికి సంబంధించి నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందని వెల్లడించారు. పూర్తి వివరాలకు 9849764646 నంబరును సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

బాపట్ల జిల్లా ఎస్పీకి డీజీపీ డెస్క్ గోల్డ్ మెడల్



ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: నూతనంగా ఏర్పడిన జిల్లాలో నేరాల నియంత్రణతో పాటు కేసుల ఛేదనలో అత్యంత ప్రతిభ కనపరిచిన ఎస్పీ వకుల్‌జిందాల్ సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర డీజీపీ డెస్క్ గోల్డ్‌మెడల్ అవార్డుకు ఎంపిక చేసింది. ఆయనతో పాటు జిల్లాలోని పి. శ్రీకాంత్ (డీఎస్పీ), జి. రాజ్‌కుమార్ (చుండూరు ఏఎస్ఐ), మహ్మద్ ఖాశిం (వేటపాలెం హెడ్ కానిస్టేబుల్), డి. మస్తాన్‌రావు (రేపల్లె ఏఎస్ఐ), పిట్టు రామారావు (చీరాల–1 టౌన్ హెడ్ కానిస్టేబుల్), డి. వీరబ్రహ్మం (చీరాల 1టౌన్ పీసీ), ఎం. వెంకటేశ్వర్లు (బాపట్ల హెడ్ కానిస్టేబుల్), షేక్ కరీముల్లా (బాపట్ల పీసీ)లను సిల్వర్ మెడల్స్‌కు ఎంపిక చేశారు. త్వరలో వీరందరికీ డీజీపీ చేతుల మీదుగా అవార్డులను అందజేయనున్నారు.

యార్డుకు 1,14,185 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,14,185 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,10,908 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది.

అతివకు అగ్రాసనం

- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం
- ఇన్నేళ్లలో ఉమ్మడి గుంటూరులో పోటీ ఇరవై ముగ్గురే..
- వైఎస్సార్‌సీపీ వచ్చాక ఐదుగురు పోటీ
- గెలిచిన ముగ్గురిలో ఇద్దరికి మంత్రి పదవులు
- మళ్లీ ఇప్పుడు నలుగురికి అసెంబ్లీ సీట్లు



దొడ్డపనేని ఇందిర



ఈవూరి సీతారావమ్మ



భవనం జయప్రద



నన్నపనేని రాజకుమారి



శనక్కాయల అరుణ

తెనాలి: ఆకాశంలో సగం...అవకాశాల్లోనూ సగం అంటూ నినాదాలు మినహా రాజకీయంగా మహిళలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ప్రతి ఎన్నికల్లోనూ చూస్తున్నాం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల రంగంలోకి వచ్చాకనే మహిళలకు ఎన్నికల బరిలో తలపడేందుకు అవకాశం దక్కుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2014, 2019లో ముగ్గురేసి మహిళలకు అసెంబ్లీ సీట్లు కేటాయించిన పార్టీ అందులో గెలిచిన ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చింది. మళ్లీ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఒక్క మహిళకు టికెట్ ఇవ్వగా, వైఎస్సార్ సీపీ నలుగురు మహిళలకు సీట్లను కేటాయించింది.

ఆరుగురికి మాత్రమే మంత్రి వర్గంలో స్థానం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2004 ఎన్నికల వరకు 19 అసెంబ్లీ నియోజకవర్గాలుంటే, పునర్వవస్థీకరణతో 2009లో రెండు రద్దయ్యాయి. ప్రస్తుతం 17 నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తంమీద ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఇప్పటివరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మహిళల సంఖ్య కేవలం 23 మాత్రమే. వీరిలో ఎనిమిది మంది తొలి పోటీలోనే ఓటమి చవిచూశారు. తర్వాత మళ్లీ ఎన్నికల్లో కనిపించలేదు. నిలిచి గెలిచిన మహిళామణులు కేవలం 15 మంది. వీరిలో రాణించి మళ్లీ అవకాశాలు దక్కించుకున్నవారు ఆరుగురు. ముగ్గురు మహిళలు మూడేసిసార్లు, మరో నలుగురు రెండేసిసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఈ ఏడుగురిలోనూ నలుగురికి, తొలిసారి గెలిచిన ఇద్దరు మహిళలకు అంటే కేవలం ఆరుగురికి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం లభించింది.

1967 ఎన్నికల్లో తొలి అవకాశం

1952 నుంచి ఎన్నికల ప్రక్రియ ఆరంభమైనా, 1967 ఎన్నికలతోనే అసెంబ్లీలో మహిళల ప్రాతినిధ్యం ఆరంభమైంది. ఆ ఎన్నికల్లో తెనాలి నుంచి దొడ్డపనేని ఇందిర, వినుకొండ నుంచి భవనం జయప్రద బరిలో నిలిచి గెలిచారు. జిల్లా నుంచి శాసనసభలో అడుగిడిన తొలి మహిళలుగా గుర్తింపును పొందారు. ఎమ్మెల్యేగా నిరూపించుకున్న జయప్రద, తర్వాతి ఎన్నికల్లోనూ విజయం సాధించి, మంత్రి పదవిని చేపట్టారు. దొడ్డపనేని ఇందిర తండ్రి ఆలపాటి వెంకట్రామయ్య తరహాలోనే తెనాలి నుంచి హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్నారు. అయినా మంత్రివర్గంలో స్థానం లభించలేదు. తర్వాత జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికి ఎన్నికయ్యారు. ఇందిరలాగే రద్దయిన కూచిపూడి నియోజకవర్గం నుంచి 1985, 1989, 1994 ఎన్నికల్లో పోటీచేసిన ఈవూరు సీతారావమ్మ ఒక పర్యాయం మంత్రిగానూ చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2012, 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ తరఫున పోటీచేసి మూడుసార్లు గెలుపొందిన మేకతోటి సుచరిత, 2019లో గెలుపు తర్వాత ఏకంగా రాష్ట్ర హోంశాఖ మంత్రిగా చేశారు.

రెండుసార్లు గెలిచింది ఇద్దరే...

రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మహిళా నేతలు ఇద్దరే ఉన్నారు. వీరిద్దరూ ఆ రెండు పర్యాయాలు వేర్వేరు పార్టీల తరఫున ఎన్నికవడం గమనార్హం. తెనాలికి చెందిన నన్నపనేని రాజకుమారి 1983లో సత్తెనపల్లి నుంచి టీడీపీ తరఫున పోటీచేసి గెలిచారు. తర్వాత ఏడాదిలోనే నాదెండ్ల భాస్కరరావు పక్షాన నిలిచి ఆయన మంత్రివర్గంలో మంత్రి పదవిని పొందారు. 1989లో కాంగ్రెస్ తరఫున వినుకొండ నుంచి పోటీచేసిన రాజకుమారి, అక్కడా గెలుపొంది నాటి ప్రభుత్వంలో చీఫ్ విప్ పదవిని పొందారు. మళ్లీ 1999లో టీడీపీలో చేరారు. 1962 ఎన్నికల్లో వినుకొండ నుంచి పోటీచూసి ఓటమిని చవిచూసిన భవనం జయప్రద 1967, 1972 ఎన్నికల్లో రెండుసార్లు గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. మంత్రిగానూ పనిచేశారు.

ఒకే ఒక్కసారి గెలిచిన మహిళలు

1967లో కేవలం ఇద్దరే మహిళలు పోటీచూసి గెలిస్తే, తర్వాత 1972 ఎన్నికల్లో వీరితోపాటు మైనారిటీ వర్గానికి చెందిన మహిళ ఫాతిమున్నీసా బేగం పెదకూరపాడులో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. ఇలా ఒక్కసారి గెలిచినవారిలో పుతుంబాక భారతి సీపీఎం తరఫున 1994లో ఎన్నికయ్యారు. జూలకంటి దుర్గాంబ 2004లో మాచర్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థినిగా, డాక్టర్ కందిమళ్ల జయమ్మ చిలకలూరిపేట నుంచి 1989లో టీడీపీ తరఫున గెలిచారు. 1999లో గుంటూరు–2 నుంచి టీడీపీ అభ్యర్థినిగా గెలిచిన డాక్టర్ శనక్కాయల అరుణ అప్పట్లో మంత్రిగానూ చేశారు. 2019 ఎన్నికల్లో తాడికొండ ఎస్సీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పార్టీ ఫిరాయింపులతో 2024 ఎన్నికల్లో పోటీకి దూరమయ్యారు. 2019లో చిలకలూరిపేట నుంచి తొలిసారిగా గెలిచిన విడదల రజిని, రాష్ట్ర మంత్రి పదవిని చేపట్టిన విషయం తెలిసిందే.

తొలి ఓటమితోనే సరి!

ఎన్నికల్లో పోటీచేసి ఓటమితో సరిపెట్టుకున్న మహిళలూ ఉన్నారు. 1955లో ప్రజాపార్టీ తరఫున తొలిగా పోటీచేసిన మహిళ కె.రంగమ్మ. ఓటమితో ఆ తర్వాత కనిపించలేదు. తర్వాత 1962లో మంగళగిరి నుండి ఎం.సత్యవతి (కాంగ్రెస్), గుంటూరు–2 నుంచి 1985లో గాదె ప్రసూనాంబ (టీడీపీ), మంగళగిరి నుంచి 2004లో టి.జానకీదేవి (బీజేపీ), సత్తెనపల్లి నుంచి 1985లో జేపీ పద్మలత (కాంగ్రెస్), మంగళగిరి నుంచి 1985లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ప్రఖ్యాత సినీనటి జమున ఓటమి చెందారు.

ఈసారి వైఎస్సార్ సీపీ నుంచి నలుగురు మహిళలు



మేకతోటి సుచరిత



విడదల రజిని

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన 2014 ఎన్నికల్లో జిల్లాలోని తాడికొండ, ప్రత్తిపాడు, వినుకొండ స్థానాల్లో మహిళలకు అవకాశం కల్పించారు. 2019 ఎన్నికల్లో తాడికొండ, ప్రత్తిపాడుతోపాటు చిలకలూరిపేట నుంచి పోటీ చేసిన వైఎస్సార్ సీపీ మహిళా అభ్యర్థులు ముగ్గురూ విజయం సాధించారు. వీరిలో మేకతోటి సుచరిత హోం శాఖ మంత్రిగా చేశారు. విడదల రజిని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నారు. ఈసారి 2024 ఎన్నికలకు నలుగురు మహిళలకు వైఎస్సార్‌సీపీ అవకాశం కల్పించడం విశేషం. ఇందులో తొలిసారిగా గుంటూరు తూర్పునకు మహిళా అభ్యర్థిని ఎంపిక చేయడం విశేషం. ఇక్కడ నూరి ఫాతిమా పోటీ చేస్తుండగా, గుంటూరు పశ్చిమ నుంచి విడదల రజిని, తాడికొండ నుంచి మేకతోటి సుచరిత, మంగళగిరి నుంచి మురుగుడు లావణ్య పోటీ చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున ఒకే ఒక మహిళ జి.మాధవి గుంటూరు పశ్చిమ స్థానం నుంచి పోటీలో ఉన్నారు.



మురుగుడు లావణ్య



నూరి ఫాతిమా

నూతన యూనిఫాంతో విధుల నిర్వహించాలి



బ్లూ క్యాప్‌ను సిబ్బందికి అమర్చుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం: విధులు నిర్వర్తించే క్రమంలో ప్రతి ఒక్కరూ బ్లూ క్యాప్, బ్లాక్ బెల్ట్, బ్లాక్ విజిల్ కార్డు ధరించాలని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. రాష్ట్ర పోలీస్ శాఖ జారీ చేసిన నూతన యూనిఫాంలో భాగంగా బ్లూ క్యాప్, బ్లాక్ బెల్ట్, బ్లాక్ విజిల్ కార్డులను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పలువురు సిబ్బందికి ఆయన అందించారు. మిగతా పోలీస్ సిబ్బంది కూడా ఇదే రీతిలో విధులు నిర్వర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు హనుమంతు (ఏఆర్), వెంకటేశ్వరరావు (సెబ్), ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, బ్రహ్మానందం, ఎస్‌బీ సీఐ వెంకటరావు పాల్గొన్నారు.

పోతురాజుగుట్టలో వృద్ధురాలి హత్య

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల శివారు బాలచంద్రానగర్ (పోతురాజుగుట్ట)లో 75 ఏళ్ల వృద్ధురాలు బుధవారం రాత్రి హత్యకు గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంట్లో చొరబడి తలను గోడకేసి మోది హత్య చేశారని ఘటనా స్థలాన్ని బట్టి భావిస్తున్నారు. సమాచారం అందుకున్న కారెంపూడి సీఐ చినమల్లయ్య, ఎస్ఐ రామాంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. హత్యకు గురైన ఆలా లక్ష్మమ్మ(75) గత పదేళ్లుగా పోతురాజుగుట్టలో ఒంటరిగా జీవిస్తూ వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అందరితో బాగా కలివిడిగా ఉంటుందని, ఆమెను ఎందుకు హత్య చేశారో తెలియడం లేదని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అబద్ధాల చంద్రబాబును నమ్మొద్దు

సంతగుడిపాడు ఎన్నికల ప్రచారంలో డాక్టర్లు అనిల్, గోపిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్, వేదికపై గోపిరెడ్డి

రొంపిచర్ల: కనురెప్ప కొట్టకుండా అబద్ధాలు చెప్పే వ్యక్తి చంద్రబాబునాయుడని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. మండలంలోని సంతగుడిపాడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలసి మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. అవసరమైన అన్ని పథకాలను అందించే వలంటీరు వ్యవస్థ కావాలో.. జన్మభూమి కమిటీలు కావాలో తేల్చుకోవాలని తెలిపారు. చంద్రబాబు మాటల్ని ప్రజలు నమ్మరని, కూటమిని అడ్డుపెట్టుకొని ఎన్నికలకు వస్తున్నారని విమర్శించారు. 85శాతం రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమిని తరిమికొట్టేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామంలో రూ.10కోట్ల వ్యయంతో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలను ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ మాట్లాడుతూ సీఎం జగన్ దూతగా ఇక్కడకు వచ్చానని తెలిపారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు తనకు ఓటు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామానికి వచ్చిన వీరికి గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. ప్రచార వాహనం నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ తమకు ఓటువేసి గెలిపించాలని నేతలు అభ్యర్థించారు. సభలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, చపారపు గోపాలరెడ్డి, చింతగుంట ఆంజనేయరెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, బత్తుల రామకృష్ణ, చింతగుంట అంజిరెడ్డి, కాటా రామిరెడ్డి, పి.కోటిరెడ్డి, పునుగోటి వెంకటరావు పాల్గొన్నారు.

'సంగం' బాధ్యతల నుంచి నరేంద్రను తప్పించండి

ఎన్నికల సంఘానికి అంబటి మురళీకృష్ణ ఫిర్యాదు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: సంగం డెయిరీ, ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ఆసుపత్రుల పేరుతో నేరుగా ఓటర్లను ప్రలోభ పెడుతున్నందున ఈ రెండింటి నుంచి ధూళిపాళ్ల నరేంద్ర, అతని అనుచరులను తప్పించాలని కోరుతూ పొన్నూరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులుగా ఉన్న వారు ప్రభుత్వాన్ని నడపడానికి మాత్రమే ఉంటారని, ఎక్కడా ఎన్నికల్ని ప్రభావితం చేసే అవకాశం ఉండదని గుర్తు చేశారు. అయితే, ధూళిపాళ్ల నరేంద్ర పొన్నూరు అసెంబ్లీ ఓటర్లను తనకున్న అధికారాలతో ప్రభావితం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆయన ప్రస్తుతం సంగం డెయిరీ కో–ఆపరేటివ్‌కు చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. 1977లో ఏర్పడిన ఈ సహకార డెయిరీకి పొన్నూరు నియోజకవర్గంలో చాలా మంది పాలు సరఫరా చేసే సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. అయితే, సంగం డెయిరీలో ఆయన అరాచకాలు, అక్రమాలకు పాల్పడటంతో ప్రభుత్వం విచారణ చేసి కేసు నమోదు చేయడంతో కొంతకాలం నరేంద్ర జైలులో ఉండి వచ్చారని, దీనికి సంబంధించిన కేసు స్థానిక న్యాయస్థానాల్లో నడుస్తోందని మురళీకృష్ణ గుర్తు చేశారు. సంగం డెయిరీ తరఫున హాస్పిటల్ ఏర్పాటు చేసి దానికి మాజీ మంత్రి, పొన్నూరు శాసనసభ్యునిగా చేసిన తన తండ్రి ధూళిపాళ్ల వీరయ్యచౌదరి పేరు పెట్టారని తెలిపారు. అయితే, ఇప్పుడు ఆసుపత్రికి వస్తున్న రోగులకు భారీగా డిస్కౌంట్లు ఇస్తూ ఓటర్లను మభ్యపెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆ ఆసుపత్రిని నరేంద్రకుమార్ భార్య, కుమార్తె, దగ్గరి బంధువులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ఓటర్లను నేరుగా ప్రలోభపెడుతున్నందున ఎన్నికలు పారదర్శకంగా జరిగే అవకాశం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ధూళిపాళ్ల నరేంద్రకుమార్, అతని అనుచరులను సంగం డెయిరీ, డీవీసీ ఆసుపత్రి నుంచి ఎన్నికలు అయ్యేవరకూ తప్పించాలని అంబటి మురళీకృష్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గీత దాటితే వేటు

- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు
- సీ విజిల్‌లో ఫిర్యాదు చేసిన వాటికి 36 నిమిషాలలో పరిష్కారం
- రాజకీయ పార్టీలకు చెందిన 12,943 పోస్టర్లు, బ్యానర్లు,గోడపై రాతలు తొలగింపు
- రూ.1.12 కోట్ల విలువైన నగదు, మద్యం, వస్తువులు సీజ్
- నిబంధనలు పాటించని 28 మంది ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు
- కొత్తగా ఓటు నమోదు, చిరునామా మార్పులకు ఏప్రిల్ 10వ తేదీతో ముగియనున్న గడువు
- వచ్చే నెల మొదటి వారంలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలపై శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, డీఆర్వో వినాయకం

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సీ విజిల్ యాప్‌ను జిల్లాలో సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. యాప్‌లో పెట్టిన సమస్యలలో 94 శాతం వాటిని 100 నిమిషాల్లోపే పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో సీ విజిల్ యాప్‌లో 398 ఫిర్యాదుల అందగా సగటున 36.44 నిమిషాలలో వాటికి స్పందిస్తున్నామని వివరించారు. సువిధ యాప్‌లో సభలు, సమావేశాలకు అనుమతుల కోసం 213 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి రాజకీయ పార్టీలకు చెందిన 3,713 పోస్టర్లు, 3,310 బ్యానర్లు, 5,071 గోడ రాతల కలిపి మొత్తం 12,094 తొలగించినట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల సమావేశాలు, ప్రచారాలలో ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్ట్ , అవుట్ సోర్స్ , సచివాలయ సిబ్బంది, గౌరవ వేతనం పొందుతున్న వారు పాల్గొనరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ నిబంధనల్ని అతిక్రమించిన 12 మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఇద్దరు కాంట్రాక్టు, ఐదుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, తొమ్మిది మంది వలంటీర్లు కలిపి మొత్తం 28 మందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

తనిఖీలు ముమ్మరం

జిల్లాలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి తనిఖీలు ముమ్మరం చేశామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటివరకు రూ.25.93 లక్షల నగదు, రూ.25.58 లక్షల విలువైన 4,811 లీటర్ల మద్యం , మరో రూ.60 లక్షల విలువైన చీరలు, కుక్కర్లు వంటి తాయిలాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. అత్యవసర పనుల నిమిత్తం, రైతుల పంట అమ్మకం ద్వారా వచ్చిన నగదుకు తగిన ఆధారాలు చూపితే ఇబ్బందిపెట్టడం లేదన్నారు.ఇందుకోసం జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కమిటీని వేసి సమస్యల్ని పరిష్కరిస్తున్నామని తెలిపారు.

ఏప్రిల్ 10 వరకు ఓటు నమోదు

మార్చి 31నాటికి 18 ఏళ్లు నిండి ఇంకా ఓటు హక్కులేని వాళ్లు ఏప్రిల్ 10వ తేదీలోపు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసి పొందే అవకాశముందని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. ఫారం–8 ద్వారా ఓటును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. ఏప్రిల్ మొదటి వారంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. ఈవీఎంలను వినియోగించే విధానం..తీసుకోవాల్సిన జాగ్రత్తలు నేర్పుతామన్నారు. ఇప్పటికే అభ్యర్థులు నామినేషన్స్ వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఎన్నికల సామగ్రి మొత్తం అందుబాటులో ఉందని తెలిపారు. జేఎన్‌టీయూ కళాశాలలో కౌంటింగ్ కోసం తగిన ఏర్పాట్లు చేశామని, నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు.

85 ఏళ్లు దాటిన వృద్ధుల వివరాలు ఇవ్వండి

నరసరావుపేట: 85 ఏళ్లు దాటిన వృద్ధుల వివరాలు తమకు ఇవ్వాలని వివిధ పార్టీల నేతలు కోరారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం సాయంత్రం కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 85 ఏళ్లు దాటిన వారు ఎంతమంది ఉన్నారు... ఏ విధంగా ఇంటిదగ్గర ఓటు తీసుకుంటారని? రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆయన్ను ప్రశ్నించారు. వృద్ధుల వివరాలను ఇవ్వాలని కోరారు. రైల్వే అధికారులు, మీడియా, ఆర్టీసీ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇవ్వాలని రాజకీయ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సమయం వచ్చినప్పుడు తప్పనిసరిగా, వీరందరికీ ఓటు హక్కు కల్పిస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. 85 ఏళ్లు దాటిన వారు ఏ విధంగా ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకుంటారో నేతలకు వివరించారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల వినతులను కలెక్టర్ శివశంకర్ లోతేటి స్వీకరించి, వారికి సమాధానం ఇవ్వాలని డీఆర్వోకు సూచించారు. సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన నేతలందరినీ ఓ గ్రూపుగా క్రియేట్ చేసి, దానిలో తన నంబర్‌ను యాడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే నమోదు చేశామని డీఆర్వో వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ రాఘవేంద్ర రావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చి సందడి చేస్తున్న విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పరీక్షలు పల్నాడు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 433 ఉన్నత పాఠశాలల నుంచి 29, 244 మంది విద్యార్థులు 127 పరీక్ష కేంద్రాలలో తమ భవితవ్యాన్ని నిర్ణయించే పది పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. వీరిలో దాదాపు మూడు నుంచి ఐదు శాతం మంది విద్యార్థులు వివిధ కారణాలతో పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాలు, సూచనలతో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ హుస్సేన్, డెప్యూటీ డీఈఓలు కె.వేణుగోపాలరావు(నరసరావుపేట), వి.వెంకటేశ్వరరావు(సత్తెనపల్లి), ఇతర అధికారులు సమన్వయంతో పది పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు.

క్లుప్తంగా

నేడు గుంటూరు 'బార్' ఎన్నికలు

నగరంపాలెం: ది గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గురువారం నగరంపాలెం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సంఘ కార్యాలయంలో ఓటింగ్ ప్రక్రియ మొదలుకానుంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 4.30 వరకు ముగియనుంది. పోలింగ్ పక్రియ ముగిసిన తర్వాత లెక్కింపు పక్రియ మొదలుకానుంది. రాత్రికల్లా గెలుపు అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నారు. అయితే ఓటింగ్ కోసం మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఓటు వేసేందుకు వచ్చే అసోసియేషన్ సభ్యులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. బార్ అసోసియేషన్ పరిధిలో 1,942 మంది న్యాయవాదులు ఉన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు నగరంపాలెం పీఎస్ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

అభ్యర్థులు వీరే..

అధ్యక్ష పదవి (ఒక్క పోస్ట్)కి యంగలశెట్టి శివసూర్యనారాయణ (బబ్లూ), కాసు వెంకటరెడ్డి, ఉపాధ్యక్ష పదవి (ఒక్క పోస్ట్)కి ఎం.దేవరాజు (దేవ), బీవీ.గౌరీశంకర్, ఏపీ లాలీ, చింతా రామకోటిరెడ్డి (డాక్టర్ రామకోటిరెడ్డి), ప్రధాన కార్యదర్శి పదవి (ఒక్క పోస్ట్)కి యర్రసాని అజయ్‌కుమార్, గురజాల అనురాధ, మోదుకూరి శ్రీనివాసరావు, సుబ్బయ్య లక్కీ, సంయుక్త కార్యదర్శి పదవి (ఒక్క పోస్ట్)కి కట్టా నరసింహం, విజయవర్మ, కోశాధికారి పదవి (ఒక్క పోస్ట్)కి కలే దేవదాసు, మేడికొండూ మల్లికార్జునరావు, లైబ్రరీ కార్యదర్శి పదవి (ఒక్క పోస్ట్)కి పల్లె నరసింహారావు (పీఎస్ఆర్), బొప్పా శ్రీనివాసరావు, క్రీడ, కల్చరల్ కార్యదర్శి పదవికి ఇస్మాయిల్ సయ్యద్ బరిలో ఉన్నారు.

'ఇంటెలిజెంట్' ఏఎస్ఐపై విచారణ

'సాక్షి' కథనంపై అధికారుల ఆరా

మంగళగిరి: 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన ఇంటెలిజెన్స్ ఏఎస్ఐ పనితీరు వివాదాస్పదం కథనం నగరంలో సంచలనం సృష్టించింది. ప్రచురితమైన కథనంపై ఉదయం నుంచే పోలీస్ వర్గాల్లో చర్చ సాగింది. స్థానిక పోలీస్ అధికారులు కూడా ఈ కథనంపై ఆరా తీశారు. ఏఎస్ఐ పనితీరు, గత ఎన్నికల్లో తన గురువు అయిన మాజీ అధికారి రామాంజనేయులు సహకారంతో లోకేష్ గెలుపు కోసం తీవ్ర స్థాయిలో కృషి చేశారని, మళ్లీ ఈ ఎన్నికల్లోనూ లోకేష్ గెలుపుకోసం పని చేస్తున్నాడని తెలుసుకున్న అధికారులు విస్మయానికి గురయ్యారు. తొలినుంచి వివాదాస్పదుడైన సదరు ఏఎస్ఐపై వచ్చిన కథనంపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపట్టారు. ఏఎస్ఐపై వేటు ఖాయమంటూ పలువురు అధికారులు చర్చించుకోవడం గమనార్హం.

ఓటరుపై ప్రలోభం.. శిక్షలతో మూల్యం

- రాజకీయ పార్టీల అభ్యర్థులు నిబంధనలు పాటించాల్సిందే
- తప్పుల తీరు బట్టి చట్ట పరిధిలో కేసులు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీలు పోటీ పడుతుంటాయి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం తీవ్రమైన నేరం. తప్పుల తీరును బట్టి ఆయా చట్టాల కింద కేసులు నమోదవుతాయి. ప్రజా ప్రతినిధ్య చట్టం, 1951 భారత శిక్షాస్మృతి చట్టాల కింద నమోదయ్యే కేసుల్లో నేరం రుజువైతే జరిమానా లేదా జరిమానాతో పాటు శిక్షకు గురవుతారు.

ఓటర్లను బెదిరిస్తే..

ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే హక్కు ఉంటుంది. ఈ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోకూడదు. ఓటర్లను ఒత్తిడికి గురిచేయడం, బెదిరించటం తీవ్రమైన నేరం. ఇలా చేసినట్లు రుజువైతే బాధ్యులపై ఐపీసీ 171 (సీ) చట్టం కింద కేసు నమోదవుతుంది.

కానుకలు పంపిణీ చేస్తే..

ఓటర్లకు మద్యం, కానుకలు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేయకూడదు. అన్నదానాలు, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదు. నిబంధనలు ఉల్లంఘించినట్లైతే ఐపీసీ 171 (ఇ) చట్టం కింద శిక్షార్హులవుతారు.

ఖర్చుల వివరాలు చూపకుంటే..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలు ఎన్నికలు ముగిసిన నెల లోగా అందించాలి. లేకుంటే ఐపీసీ 171 (ఐ) సెక్షన్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

విద్వేష పూరిత ప్రసంగాలు..

ఓట్ల కోసం కులం, మతం, ఓ సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, ఎదుటి వ్యక్తుల మనోభావాలను కించపరచటం వంటివి చేయకూడదు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 కింద కేసు నమోదవుతుంది.

లేనిది ఉన్నట్లు చెప్పినా..

ప్రచారం చేసే అభ్యర్థులు ప్రజలను ఆకర్షించేందుకు ఒక్కోసారి అబద్ధాలు చెబుతుంటారు. లేనిది ఉన్నట్లు ప్రచారం చేస్తుంటారు. దీనిపై ప్రత్యర్థులు ఫిర్యాదు చేస్తే ఐపీసీ 171 (జి) కింద కేసు నమోదవుతుంది.

ప్రచార సమయం మించితే..

అభ్యర్థులకు కేటాయించిన సమయాన్ని మాత్రమే వినియోగించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా మైకులు వాడటం, ప్రచార సామాగ్రి వినియోగించడం నేరం. దీనికి గాను ఐపీసీ 171 (ఎఫ్) చట్టం కింద చర్యలు తీసుకుంటారు.

మద్యం పంపిణీ చేస్తే...

ఎన్నికలంటే మొదట గుర్తుకొచ్చేది మద్యం. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు మద్యం ఎక్కువగా పంపిణీ చేస్తుంటారు. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి మూడు సీసాలకు మించి తీసుకెళ్లడం నేరం. నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లకు మద్యం పంపిణీ చేసేందుకు భారీ మోతాదులో రవాణా చేస్తూ పట్టుబడితే అబ్కారీ చట్టం 1968 సెక్షన్ 34 (ఎ) కింద కేసు నమోదు చేస్తారు. దీనికి గాను ఆరు నెలల నుంచి ఏడాది వరకు శిక్ష, రూ.5 వేల నుంచి రూ. 20 వేల వరకు జరిమానా విధిస్తారు.

డబ్బు పంపిణీ చేస్తే...

అభ్యర్థులు అక్రమ చెల్లింపులు చేయడం నేరం. ఇలా చేస్తే ఐపీసీ 171(హెచ్) కింద చర్యలు ఉంటాయి. అధికారులకు లంచం రూపంలో డబ్బులిచ్చినా.. ఓటర్లకు డబ్బులు పంచినా ఐపీసీ 171 (బి) సెక్షన్ కింద చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ ప్రకటనలు అనుమతించవద్దు

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాలతో పాటు కార్యాలయాల్లో కూడా ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టరులు, బ్యానర్లను అనుమతించ వద్దని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం జాతీయ, ప్రధాన రహదారుల పక్కనున్న హోర్డింగులు అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయించాలని, నూతన హోర్డింగులకు అనుమతులను ఏమాత్రం ఇవ్వొద్దన్నారు. ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్స్‌కు ఎటువంటి అనుమతి లేదని, ఇప్పటికే ఉన్నవాటిని వెంటనే చెరిపించాలని కోరారు. ప్రభుత్వ అనుమతితో ప్రైవేటు భవనాలపై ఇప్పటికే ఉన్న హోర్డింగులు, కటౌట్ల భద్రతను, నిర్మాణ స్థిరత్వాన్ని ఒకసారి పరిశీలించాలని, స్ట్రక్చర్‌లో ఏమాత్రం దృఢత్వం లేకపోయినా ప్రకటనలకు అనుమతించ వద్దన్నారు. ముందస్తు అనుమతితో ప్రైవేటు ప్రాంగణాల్లో సులువుగా తరలించగలిగే ఒక జెండాను, చిన్న బ్యానర్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించాలని సూచించారు. అదే విధంగా సి-విజిల్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పటిష్టంగా అమలు పర్చాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం-7, వివరాలను సరిదిద్దేందుకు సంబంధించి పెండింగ్ ఉన్న ఫారం-8లను చట్టబద్ధమైన విధానంలో త్వరితగతంగా పరిష్కరించాలని కోరారు. ఎన్నికల నియమావళి అమల్లో ఎటువంటి అలసత్వానికి తావులేకుండా ఎవరికి నిర్దేశించిన విధులు వారి తప్పకుండా నిర్వర్తించాలని ఆదేశించారు.

'సంగం' ట్యాంకర్ ఢీ కొని యువకుడి మృతి

చేబ్రోలు: సంగం డెయిరీ పాల ట్యాంకర్ ఢీ కొని మెకానిక్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వేజండ్ల అడ్డరోడ్డు వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తెనాలి చినరావూరుకు చెందిన అవ్వారు మోహన కృష్ణ(25) ద్విచక్ర వాహనంపై నారాకోడూరు వైపు నుంచి తెనాలికి వెళ్తున్నాడు. వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో తమిళనాడు నుంచి సంగం డెయిరీకి



వెళ్తున్న సంగం డెయిరీ పాల వాహనం ప్రమాదవశాత్తూ ఢీ కొట్టింది. ఈ ఘటనలో యువకుడు మోహనకృష్ణ అక్కడికక్కడే మరణించాడు. మృతుడు మోహనకృష్ణ తెనాలిలో బైక్ మెకానిక్ పనిచేస్తున్నట్లు తెలిసింది. చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద ఘటన విషయాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సుప్రీం ప్రధాన న్యాయమూర్తిని కలిసిన శశిధర్



చీరాల రూరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డీవై చంద్రచూడ్‌ను బుధవారం తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో చీరాల సనాతన్ జీవన్ ట్రస్టు నిర్వాహకులు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గడ శశిధర్ కలిశారు. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలోని తాళపత్రాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బుధవారం తిలకించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ తాళపత్ర గ్రంథాల విశిష్టతను గురించి న్యాయమూర్తికి వివరించారు. గ్రంథాలను డిజిటలైజేషన్ చేసి కంప్యూటరీకరణ చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు అందించవచ్చునని వివరించినట్లు చెప్పారు. అనంతరం న్యాయమూర్తి విశ్వవిద్యాలయంలో సంరక్షిస్తున్న వేద, వేదాంగంగా, ఆగమ, పురాణ, ఇతిహాస, న్యాయ, దర్శనాలకు సంబంధించిన తాళపత్ర గ్రంథాల సంరక్షణ, డిజిటలైజేషన్ ప్రక్రియ, వాటి ప్రచురణను న్యాయమూర్తి పరిశీలించారని చెప్పారు. టీటీడీ వారు ఇటువంటి వేద విశ్వవిద్యాలయాలను నడపడం, పురాతన తాళపత్ర గ్రంథాలను భద్రపరచేందుకు వాటిని తర్జుమా చేసి డిజిటలైజేషన్ చేయడం ఎంతో మంచిపరిణామమని న్యాయమూర్తి ఆనందం వ్యక్తం చేశారని చెప్పారు.

బ్రహ్మంగారి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి



కంభంపాడు గ్రామంలో బ్రహ్మం గారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని కంభంపాడులో బ్రహ్మం గారి తిరునాళ్ల సందర్భంగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలకతీతంగా గ్రామ ప్రజలంతా ఒక్కటై బ్రహ్మం గారి తిరునాళ్లను నిర్వహించుకోవటం గ్రామ ఐక్యతకు నిదర్శనమన్నారు. స్వామి వారి ఆశీస్సులతో వృద్ధిగా పంటలు పండి రైతన్నలు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. పురవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆరికట్ల చంద్రారెడ్డి, కావూరి రామస్వామి, లక్ష్మయ్య, పెమ్మసాని నాసరయ్య, కంచర్ల యేగయ్య, పాశం బుగ్గ మల్లారెడ్డి, గాంతి వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల సీతారెడ్డి, బ్రహ్మారెడ్డి, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి, సైదిరెడ్డి, ఆలయ ధర్మకర్త బీరవల్లి సత్యనారాయణరెడ్డి, కొరటా సీతయ పోతురాజు వెంకటేశ్వర్లు, కొరటా పద్మనాబులు, కారుమంచి పెదబుజ్జి, అర్చకులు దార్ల వెంకటేశ్వర్లు, పెద వెంకటేశ్వర్లు, సర్పంచి యశోదమ్మ, ఎంపీటీసీ కాశిబోయిన రమణ, నక్కా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు రూ.10.93 లక్షల సాయం

చెక్కులు అందజేసిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు తోటిబ్యాచ్ కానిస్టేబుళ్లు ఆర్థిక సహాయం చేయటం అభినందనీయమని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన ఇరువురి కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు రూ.10.93 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. 2011 బ్యాచ్‌కు చెందిన ఎస్.అశోక్, యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, ఈ ఏడాది మార్చి 6వ తేదీన కోటప్పకొండ బందోబస్తు విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా, చిలకలూరిపేట పట్టణ శివారులో అతడి బైకును వెనుకనుంచి టిప్పర్‌లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అతడికి తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు అందరూ కలసి తమ వంతు సహాయంగా ఇచ్చిన రూ.8 లక్షలు చెక్కు, పోలీస్ అసోసియేషన్ నుంచి చేయూత పథకం కింద మంజూరైన మరో రూ.లక్ష చెక్కును కానిస్టేబుల్ భార్య సీహెచ్ లక్ష్మీదేవికి అందజేశారు. అదేవిధంగా జిల్లా ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్ పనిచేస్తున్న ఎస్.గోపిరెడ్డి, మార్చి మూడో తేదీన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీస్ అసోసియేషన్ నుంచి చేయూత పథకం కింద రూ.లక్ష చెక్కు, ఏఆర్ విభాగం అందించిన రూ.93 వేలు నగదును ఆ కానిస్టేబుల్ భార్య కె.పూర్ణిమకు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, ఏఆర్ డీఎస్పీ గాంధిరెడ్డి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు, 2011 బ్యాచ్ కానిస్టేబుళ్లు సీహెచ్ అనంత్, ఎస్.శివప్రసాద్, కె.రాయపరెడ్డి, షేక్ ఎం.బాషా, కె.మధుబాబు, శివరాంప్రసాద్, రత్నకిషోర్ పాల్గొన్నారు.

విశ్రాంత జడ్జి సాల్మన్‌రాజ్‌కు నివాళి



సాల్మన్ రాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి అనేక మంది కక్షిదారులకు సత్వరమే న్యాయం అందించేలా విశ్రాంత న్యాయమూర్తి సాల్మన్‌రాజ్ కృషి చేశారని పలువురు న్యాయవాదులు కొనియాడారు. సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన సాల్మన్ రాజ్ మృతి చెందారు. మంగళవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఆయన మృతి న్యాయ వ్యవస్థకు, వారి కుటుంబానికి తీరని లోటన్నారు. సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ నెల్లూరు జిల్లా జడ్జిగా ఉద్యోగోన్నతిపై వెళ్లిన ఆయన న్యాయసహాయం చేయడంలో ఎప్పుడూ ముందు ఉండేవారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన సేవలందించినట్లు చెప్పారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజవరపు శివనాగేశ్వరరావు, బూతుకూరి రామిరెడ్డి, సయ్యద్ అబ్దుల్‌రహీమ్, దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, చిన్నం మణి బాబు, కంబాల అనిల్ కుమార్, కన్నెధార హనుమయ్య, జొన్నలగడ్డ విజయ్ కుమార్, సూరె వీరయ్య, మూర్తి, బీఎల్ కోటేశ్వరరావు, ఆర్.నరసింహారావు, పి.రవి, వి.పాపారావు, బి.శ్రీనివాసరావు, టి. హరనాథ్ బాబు, జగన్ మోహనరావు, ఎస్.బాబూరావు పాల్గొన్నారు.

తల్లి మృతి.. పది పరీక్షలకు హాజరైన తనయుడు

- భార్య మృతదేహం ఇంటి వద్దే ఉన్నా తనయుడిని పరీక్షకు తీసుకువెళ్లిన తండ్రి
- బలుసుపాడులో విషాద సంఘటన



తండ్రితో కలసి పరీక్ష రాసేందకు వచ్చిన యోగేంద్ర

పెదకూరపాడు: కన్నతల్లి పేగు బంధం ఒక వైపు..పది పబ్లిక్ పరీక్షలు మరోవైపు.. ఆ విద్యార్థికి అగ్ని పరీక్ష పెట్టాయి. పదహారేళ్ల పాటు కంటికి రెప్పలా కని పెంచిన తల్లి మృతి చెందినా.. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని.. అమ్మ మాటలను గుర్తు చేసుకొని తండ్రితో కలసి తల్లి కోర్కెను తీర్చేందుకు పరీక్ష రాసేందుకు వచ్చాడు ఆ విద్యార్థి. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన కడియాల ఆదినారాయణ, పావనిలకు వెంటక యోగేంద్ర, పూజిత సంతానం. ఆదినారాయణ న్యూడిల్స్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తారు. గత వారం రోజులుగా తల్లి పావని జ్వరంతో బాధ పడుతుంది. ఈ క్రమంలో ఆదివారం పావనికి జ్వరం తీవ్రం కావడంతో సత్తెనపల్లి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.వైద్యులు ఆమెకు డెంగ్యూ లక్షణాలతో పాటు కామెర్లు కూడా సోకినట్లు గుర్తించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది. ఈ క్రమంలో కుమారుడు వెంటక యోగేంద్ర మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో జెడ్పీ పాఠశాల నందు పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. తల్లి పావని మృతివార్త తెలుసుకొని తల్లడిల్లాడు. తన తల్లి ఆశయం కోసం ఆమె మృతదేహం ఒక వైపు ఉన్నా తండ్రి ఆదినారాయణతో కలసి పరీక్ష రాసేందుకు వచ్చాడు. ఈ విషాద గాథ పలువురిని కంట తడి పెట్టించింది.



మృతి చెందిన తల్లి పావని (పాత చిత్రం)

చదువుతో పాటు క్రీడలూ ప్రధానమే

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి
- ఫార్మసీ విద్యార్థుల క్రీడా పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవ వేదికపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జూపూడి రంగరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుతో పాటు క్రీడలు కూడా ప్రధానమేనని, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకుని నిలబడటంలో క్రీడా నైపుణ్యం ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం స్పర్థ-2కే24 పేరుతో ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్పోర్ట్స్‌మీట్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ఫార్మసీ విద్యలో నైపుణ్యాలతో పాటు ఔషధ రంగంలో పరిశోధనలు చేస్తూనే క్రీడాంశాల్లో ప్రావీణ్యం కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగా ఉత్సాహంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉండగలరన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో శిక్షణ పొందడం ద్వారా విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని తమ కుటుంబంతో పాటు చదువుతున్న కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ హిందూ ఫార్మసీ కళాశాల రజతోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా రెండు రోజుల పాటు కబడ్డీ, కేరమ్స్, వాలీబాల్, చెస్, షాట్‌పుట్, త్రోబాల్ అంశాల్లో పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించి, పావురాలను, బెలూన్లను ఎగురవేశారు. కార్యక్రమంలో కబడ్డీ రిఫరీ వెలగా అమ్మయ్య, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూధనరావు, గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, పాలకమండలి సభ్యులు మాజేటి ప్రసాద్, చింతలపాటి వెంకట్రామయ్య, చెరువు రామమూర్తి, డాక్టర్ రామాతారక్‌నాథ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ అజిత్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు వేర్వేరు కేసుల్లో 8 బైక్‌లు స్వాధీనం

- చోరీకి ఉపయోగించిన ఇన్నోవా కారు
- ఏడుగురి నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ



భట్టిప్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఇన్నోవా కారు

భట్టిప్రోలు: రెండు వేర్వేరు కేసుల్లో చోరీకి గురైన రూ.5.20 లక్షల చేసే ఎనిమిది బైక్‌లు, చోరీకి ఉపయోగించిన ఇన్నోవా కారును పోలీసులు చాకచక్యంగా పట్టుకుని ఏడుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. బాపట్ల డీఎస్పీ టి.మురళీకృష్ణ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 20వ తేదీన ఎన్‌హెచ్ 216 రహదారిలో ఐలవరం మణికంఠ సప్లయిర్స్ వద్ద పెట్టి ఉన్న మోటారు సైకిల్ అపహరణకు గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా భట్టిప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 4, కర్లపాలెం, టంగుటూరు పీఎస్ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 6 మోటారు సైకిళ్లతో పాటు ఇందుకు ఉపయోగించిన ఇన్నోవా కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం సీతారామపురం తండాకు చెందిన మీరాజోత్ ప్రసన్నకుమార్ నాయక్ రమావత్ దుర్గాప్రసాద్ నాయక్, బాణావత్ తులసిబాబు నాయక్, బాణావత్ హనుమానాయక్‌లను అరెస్టు చేశారు. అలాగే జనవరి 27వ తేదీన ఎన్‌హెచ్ 216 రహదారిలో పసుపులేటి రాజేష్‌కు చెందిన పంట పొలం పక్కనే పెట్టిన మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు రంగంలోకి దిగి చోరీకి పాల్పడిన నిందితులైన కర్లపాలెం మండలం పెదపులుగవారిపాలెంకు చెందిన శవనం శ్రీనివాసరెడ్డి, వారి మురళీకృష్ణారెడ్డి, భట్టిప్రోలు మండలం ఓలేరు పంచాయతీ పరిధిలోని వెంకట్రాజునగర్‌కు చెందిన దాసరి భరత్‌లను అరెస్టు చేశారు. నిందితులను గురువారం రేపల్లె కోర్టులో హాజరు పరిచారు. వీరిలో ఒకరు మైనర్ కాగా గుంటూరులోని జువైల్ డిస్ట్రిక్ట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన భట్టిప్రోలు ఎస్ఐ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్స్ ఈపూరి వెంకటేశ్వరరావు, సైకం నాగరాజు, గంటా మాధవరావు, తాడివాక వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్స్ క్రాప పుల్లారావు, బేతల అనీల్ కుమార్, కాటూరి నాగరాజు, హోమ్ గార్డు కె.ప్రసాద్‌లను డీఎస్పీ అభినందించారు. వీరికి రివార్డు నిమిత్తం బాపట్ల ఎస్పీ కార్యాలయానికి రివార్డ్‌కు ప్రతిపాదన పంపడం జరిగిందని వివరించారు. విలేకరుల సమావేశంలో వేమూరు సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హైకోర్టులో ఏసీ ఏఎంసీ కోసం టెండర్ నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: హైకోర్టులో ఏర్పాటు చేసిన డైకిన్, మిత్సుబిషి క్యాసెట్, స్ప్లిట్ ఏసీల వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్ (ఏఎంసీ) విషయంలో స్థానిక డీలర్లు, ఏజెన్సీల నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తూ హైకోర్టు రిజిస్ట్రీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తిగల వారు ఏప్రిల్ 4 సాయంత్రం 5 గంటల లోపు సీల్డ్ కవర్‌లో తమ కొటేషన్లను సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు హైకోర్టు వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.